




# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 103,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,శుక్రవారం, తేదీ : 14-08-2026


## రాహుల్ గాంధీ అహంకారానికి వర్షాకాల సమావేశాలు బలి



- సభా సమావేశాలు సజావుగా జరగకపోవడానికి కారణం రాహుల్ గాంధీనేనని బీజేపీ ఆరోపణ
- చర్చలకు సిద్ధమని అధికార పక్షం చెబుతున్నప్పటికీ మొండితనంగా వ్యవహరించారని వ్యాఖ్య
- బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్

ఢిల్లి : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకపడింది.

## పంచధారల' వారసత్వ సంపదకు ముప్పు.. కేంద్రం జోక్యం చేసుకోవాలి

- రాజ్యసభలో పంచధారల మైనింగ్ అంశాన్ని లేవనెత్తిన వైవీ సుబ్బారెడ్డి
- వారసత్వ కట్టడాల పరిరక్షణకు మైనింగ్ తక్షణం ఆపాలని డిమాండ్
- కేంద్ర మంత్రులను కలిసి ఫిర్యాదు చేసిన వైసీపీ ఎంపీలు
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాత్రపై సీబీఐ విచారణకు అభ్యర్థన



ఢిల్లి : ఆంధ్రప్రదేశ్‌లోని పంచధారల వారసత్వ ప్రాంతం సమీపంలో మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ వైసీపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై పార్టీ సీనియర్ నేత, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గురువారం రాజ్యసభలో గళం విప్పారు. ప్రాచీన బౌద్ధ స్థూపాలు, ఆలయాలను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని, మైనింగ్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. మినరల్స్ సవరణ బిల్లు, 2026పై జరిగిన చర్చలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పంచధారలలోని బౌద్ధ క్షేత్రం, పురాతన ధర్మలింగేశ్వర స్వామి మిగతా..2లో

## 5వేల మంది పైలట్లకు డ్రగ్ టెస్టులు

- పుకెట్-ఢిల్లీ విమాన పైలట్‌కు గంజాయి పాజిటివ్ రావడంతో కీలక నిర్ణయం
- ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లోని పైలట్లందరికీ తప్పనిసరి పరీక్షలు
- నిషేధిత డ్రగ్స్, మందుల వినియోగంపై పూర్తిస్థాయి స్క్రీనింగ్



ఢిల్లి : ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. రెండు సంస్థల్లో పనిచేస్తున్న పైలట్లందరికీ సైకోఆక్టివ్ పదార్థాల పరీక్షలు నిర్వహించనున్నాయి. ఇటీవల పుకెట్- ఢిల్లీ విమానం అకస్మాత్తుగా సుమారు 300 అడుగులు కిందకు పడ్డ ఘటనలో విమాన సిబ్బందిలోని పైలట్ కు నిర్వహించిన నిర్ధరణ పరీక్షలో గంజాయ్ పాజిటివ్ గా తేలింది. ఆ నేపథ్యంలోనే రెండు సంస్థలు నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు గురువారం తెలిపాయి. అయితే టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఆ రెండు విమానయాన సంస్థల్లో కలిపి 5000 మందికిపైగా పైలట్లు ఉన్నారు. వారందరికీ పరీక్షలు నిర్వహించనున్నారు. మిగతా..2లో

## శ్రీరామకుంట వైకుంఠధామాన్ని ఆహ్లాదకరమైన పార్కు తరహాలో తీర్చిదిద్దుతున్నాం



- సిద్దిపేట శ్రీరామకుంట వైకుంఠధామం పనులను పర్యవేక్షించిన హరీశ్
- పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన మాజీ మంత్రి
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్: సిద్దిపేట శ్రీరామకుంట వైకుంఠధామాన్ని సరికొత్త రీతిలో ఒక ఆహ్లాదకరమైన పార్కు తరహాలో తీర్చిదిద్దుతున్నామని మాజీ మంత్రి, స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. సిద్దిపేట పట్టణ పరిధిలోని శ్రీరామకుంట శ్మశానవాటికలో సాగుతున్న సుందరీకరణ పనులను ఆయన ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన... మిగిలిన పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## కాంగ్రెస్ ఉన్నంత కాలం దేశంలో లౌకికవర్గాలకు మనుగడ

- బంజారాహిల్స్‌లోని మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదని విమర్శ
- హిందూ, ముస్లింలను వేర్వేరుగా చూడనని, రెండు కళ్లలా చూస్తానని స్పష్టం



వివరాలు 2లో..

హైదరాబాద్ : కాంగ్రెస్ అంటే సెక్యులర్ పార్టీ అని హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చిందని తెలిపారు. బంజారాహిల్స్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమ్మిట్‌లో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అజారుద్దీన్ లు పాల్గొన్నారు. లౌకిక వర్గాలకు మనుగడ ఉంటుంది : ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం సర్టిఫికెట్లు చూసి కాదని, నైపుణ్యాలు చూసి ఉద్యోగం ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మైనార్టీలకు రిజర్వేషన్లను తీవ్రంగా వ్యతిరేకించారని, మైనార్టీ రిజర్వేషన్ల రద్దుకు హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారని రేవంత్ రెడ్డి తెలిపారు.

## కాళేశ్వరం, యూనిటీ మాల్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరపాలి

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై రఘునందన్ రావు ధ్వజం**



- కాళేశ్వరం అక్రమాలపై డీపీఆర్ నుంచి విచారణ జరిపించాలన్న రఘునందన్ రావు
- కాంగ్రెస్ తప్పులపై కూడా విచారణ జరపాలని డిమాండ్
- ప్రజలను దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీ పడుతున్నాయని విమర్శ

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై కేవలం మూడు బ్యారేజీలకు మాత్రమే పరిమితం కాకుండా, డీపీఆర్ తయారీ నుంచి ముగింపు చెల్లింపుల వరకు మిగతా..2లో

## ఇంద్రకీలాద్రిపై కొత్త భద్రతా నిబంధనలు



పసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులకు కొత్త భద్రతా నిబంధనలను ఆలయ అధికారులు అమలులోకి తీసుకొచ్చారు.

ఆలయ ప్రాంగణంలోకి మొబైల్ ఫోన్లపై పూర్తిస్థాయిలో నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

విజయవాడ, ఆగస్టు 13: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులకు కొత్త భద్రతా నిబంధనలను ఆలయ అధికారులు అమలులోకి తీసుకొచ్చారు. ఆలయ ప్రాంగణంలోకి మొబైల్ ఫోన్లపై పూర్తిస్థాయిలో నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. స్కానింగ్ పాయింట్ వద్ద మిగతా..2లో

## మహిళల ఆర్థిక స్వావలంబనకు 'ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం



వంద శాతం సబ్సిడీపై ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12 వేలు ఉందని..

బీసీ మహిళల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చి ఆర్థిక వృద్ధి సాధించడమే లక్ష్యం

హైదరాబాద్: తెలంగాణలోని మహిళలకు 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని.. ఇది నిరంతరం కొనసాగే పథకం అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. వంద శాతం సబ్సిడీపై ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12 వేలు ఉందని.. వాటిని ఉచితంగా మహిళలకు ఇస్తామని తెలిపారు. బీసీ మహిళల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చి మిగతా..2లో

## ఇది ఆరంభం మాత్రమే.. గ్రాఫిక్స్ అన్నవాళ్ల కళ్లు తెరిపించేలా అమరావతి



- అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవం
- హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రపంచ టాప్ 5 నగరాల్లో ఒకటిగా అమరావతిని తీర్చిదిద్దుతామని వెల్లడి
- రాజధాని నిర్మాణానికి ఐదు కీలక సూత్రాలను ప్రకటించిన ముఖ్యమంత్రి
- భూములిచ్చిన రైతుల త్యాగాన్ని కొనియాడిన చంద్రబాబు
- మూడు రాజధానుల విధానంతో గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని విమర్శ
- 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని స్ఫూర్తిదాయకంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపు

## 190 కిమీ ఔటర్, 96 కిమీ ఇన్నర్ రింగురోడ్డు కేంద్రం మంజూరు చేసింది

- 2028 నాటికి భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయాలని సూచించారు.
- కేవలం జెండా వందనం ఒక్కటే కాదు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టటం ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.



అమరావతి : 2028 నాటికి భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 190 కిలోమీటర్ల అవుటర్, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగురోడ్డును కూడా కేంద్రం మంజూరు చేసిందన్నారు. సింధూ నాగరికత తరహాలోనే రాజధాని నగరంలో సీడ్ యాక్సెస్ రహదారులు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. 2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నామన్న సీఎం, మరి మీరు ఏం సంకల్పం చేస్తారని ప్రశ్నించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయాలని సూచించారు. ప్రజా ఉద్యమంగా తిరంగ ర్యాలీ: అనునిత్యం ప్రజల సంకల్పాన్ని నెరవేర్చుకునే ఆలోచనలు చేస్తే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. మనకు స్వాతంత్ర్యం ఎందుకు వచ్చిందో అంతా మర్చిపోతున్నామని అన్నారు. కేవలం జెండా వందనం ఒక్కటే కాదు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టటం ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులు, విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు ఎవరైనా తమ ప్రాంతాల్లో కృషి చేయాలని కోరారు. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలన్నారు. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. మిగతా..2లో

## దేశంలో ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కి పెరిగిందన్న డిప్యూటీ సీఎం



- ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు.. వాటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి
- ప్రపంచ ఏనుగుల దినోత్సవంలో పాల్గొన్న పవన్ కల్యాణ్
- మానవ-ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నామని వెల్లడి

అమరావతి : ఏనుగులు కేవలం అడవులకే పరిమితం కాకుండా జీవవైవిధ్యానికి కాపలాదారులుగా, దేశ సంస్కృతి, మిగతా..2లో

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక
శుక్రవారం 14-08-2026

మొదటి పేజి తరువాయి

## 190 కిమీ ఔటర్, 96 కిమీ ఇన్నర్ రింగురోడ్డు కేంద్రం మంజూరు చేసింది

ఓ ప్రజా ఉద్యమంగా తిరంగ ర్యాలీ జరగాలని, వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్ గా తయారు కావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. మొదటి మెట్టు ఎక్కాం: 2047 నాటికి స్వర్ణాంధ్రగా ఏపీ తయారు కావాలని, ఆ శక్తి సామర్థ్యాలను ప్రజలే అందించాలని కోరారు. అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. అమరావతి ఆర్థిక రాజధానిగా మారాలి. స్వాంతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని ప్రజలంతా అందిపుచ్చుకోవాలన్నారు. సీడ్ యాక్సెస్ రహదారి, స్టీల్ బ్రిడ్జిలతో మొదటి మెట్టు ఎక్కామని చంద్రబాబు వెల్లడించారు. రాజధాని అమరావతికి రాజమార్గంగా చెబుతున్న సీడ్ యాక్సెస్ రహదారి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అమరావతి రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలవనున్న ఇు-3 సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు.

## ఇంద్రకీలాద్రిపై కొత్త భద్రతా నిబంధనలు

కొత్త భద్రతా గేట్ ఏర్పాటు చేశారు. స్కానింగ్ తర్వాత మొబైల్ ఫోన్ లోపలికి వెళ్లకుండా కఠినంగా తనిఖీలు చేయనున్నారు. ఈ నిబంధనల ప్రకారం, క్యూ లైన్లలోకి వెళ్లే ముందే ఫోన్లను డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. మొబైల్ ఫోన్ల కోసం ప్రత్యేక డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. భద్రతా తనిఖీలను కట్టుదిట్టం చేయాలని ఆలయ ఈవో శీనా నాయక్ ఆదేశాలు జారీ చేశారు. హోంగార్డులు, అజైల్ సెక్యూరిటీ సిబ్బందితో పటిష్ఠమైన భద్రతను కల్పించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రద్దీ నియంత్రణకు దర్శన లైన్లలో మార్పులు చేపట్టారు. దర్శన టికెట్ల జారీ కౌంటర్ల స్థానాల్లో మార్పులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఉచిత లడ్డూ ప్రసాదం కౌంటర్లను కూడా అధికారులు మార్చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా నేరుగా దర్శనానికి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. కొత్త నిబంధనలకు భక్తులు సహకరించాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ ఉన్నంత కాలం దేశంలో లౌకికవర్గాలకు మనుగడ

మైనార్టీ రిజర్వేషన్లను రద్దు చేయడంలో మోదీ, అమిత్‌షా విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ వస్తే మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేస్తామని అమిత్‌షా చెప్పారని, గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరామని అన్నారు. కాంగ్రెస్ ఉన్నంతకాలం దేశంలో లౌకిక వర్గాలకు మనుగడ ఉంటుందని, లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు. వాళ్లు ప్రశ్నపత్రాలు కొనుగోలు చేస్తారు : బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదని, ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారని సీఎం విమర్శించారు. డబ్బులున్న వాళ్లు ప్రశ్నపత్రాలు కొనుగోలు చేస్తారని, ప్రశ్నపత్రాలు కొనుగోలు చేసిన వారి నియామకానికి గతంలో కృషి చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం ఆర్ఎంపీ వైద్యుడిని పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిని చేసిందని, తమ అనుయాయులను పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులను చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అంటే సెక్యులర్ పార్టీ. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తుంది. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. మైనార్టీలకు రిజర్వేషన్లను రాష్ట్రంలో తీవ్రంగా వ్యతిరేకించారు. రిజర్వేషన్ల రద్దుకు హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారు. కాంగ్రెస్ ఉన్నంత కాలం దేశంలో లౌకిక వర్గాలకు మనుగడ ఉంటుంది. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. - సీఎం రేవంత్ రెడ్డి హిందూ, ముస్లింలను వేర్వేరుగా చూడను : కాంగ్రెస్ వచ్చాక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామన్న రేవంత్ రెడ్డి, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో విద్యావంతులను నియమించామని తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్-1 పోస్టుల భర్తీ చేపట్టామని, గ్రూప్-1 రద్దు చేయాలని సుప్రీంకోర్టు వరకు బీఆర్ఎస్ నేతలు వెళ్లారని ఆరోపించారు. సుప్రీంకోర్టులోనూ మంచి లాయర్‌ను పెట్టి గ్రూప్-1 నియామకాలు పూర్తి చేశామని, గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశామని వెల్లడించారు. హిందూ, ముస్లింలను వేర్వేరుగా చూడనని, రెండు కళ్లలా చూస్తానని స్పష్టం చేశారు. నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3 కోట్ల ప్రోత్సాహకం ఇచ్చామని, క్రికెటర్ సిరాజ్‌కు ఉద్యోగం ఇవ్వడం అంత తేలిక కాదని, నిబంధనలు పక్కనపెట్టి సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చామని గుర్తు చేశారు.

## శ్రీరామకుంట వైకుంఠధామాన్ని ఆహ్లాదకరమైన పార్కు తరహాలో తీర్చిదిద్దుతున్నాం

శ్మశానవాటిక ప్రాంగణంలో పచ్చదనం పెంచేలా మరిన్ని మొక్కలు నాటాలని హరీశ్ సూచించారు. ప్రజల రాకపోకలకు వీలుగా సీసీ రోడ్లు, భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో దహన సంస్కారాల కోసం వచ్చే ప్రజలు వెలుతురు లేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా... వెంటనే సరైన లైటింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. వీటితో పాటు టాయిలెట్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి శుభ్రత ఉండేలా చూడాలన్నారు. పర్యావరణహిత పద్ధతిలో బయోగ్యాస్ ద్వారా దహన సంస్కారాలు నిర్వహించేలా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు 'ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం

ఆర్థిక వృద్ధి సాధించడమే లక్ష్యం అని పేర్కొన్నారు. బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు పథకం తీసుకువచ్చినట్లు వివరించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో గురువారం లాంఛనంగా పథకాన్ని ప్రారంభించిన అనంతరం పొన్నం ప్రభాకర్ కీలక ప్రసంగం చేశారు. బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించి వారిని కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12,000 కాగా లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా వంద శాతం సబ్సిడీపై అందిస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ బీసీ మహిళలకు ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అత్యంత పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, వికలాంగులు, కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న మహిళలకు నిబంధనల మేరకు ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. కుట్టు మిషన్ల కోసం మహిళల నుంచి అధిక డిమాండ్ ఉంటుందని.. మొదటి దశలో 1.19 లక్షల మంది అర్హులకు ప్రయోజనం కల్పిస్తామని మంత్రి ప్రభాకర్ తెలిపారు. భవిష్యత్‌లో పథకాన్ని మరింత విస్తరించి ఎక్కువ మంది మహిళలకు ప్రయోజనం కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, ఇతర స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఆత్మగౌరవ భవనాలకు నిధులు కేటాయిస్తూ, వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల బలహీన వర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి బీసీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కులగణన అనంతరం బీసీల అభివృద్ధికి సంబంధించిన తదుపరి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వీ హనుమంతరావు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్ తదితరులు

## కాళేశ్వరం, యూనిటీ మాల్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరపాలి

సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు కోరుతూ కేంద్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే లేఖ రాయాలని, తానే స్వయంగా కేంద్ర హోంమంత్రిని కలిసి విచారణ ముందుకు సాగేలా కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 202 కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమితో చేపట్టనున్న 'యూనిటీ మాల్' ఒప్పందంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపైనా విచారణ జరగాలని రఘునందన్ రావు అన్నారు. గతంలో కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిపినప్పుడు, ఇప్పుడు కాంగ్రెస్ తప్పులపైనా దర్యాప్తు ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో జరిగిన 10 ఎకరాల భూకేటాయింపుతో పాటు ప్రస్తుత యూనిటీ మాల్ ఒప్పందంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఎకరం భూమి విలువ వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని, అవి కేవలం కస్టోడియన్లుగా మాత్రమే ఉండాలని ఎంపీ తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రజల సొమ్మును దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని, అవినీతిలో ఈ రెండూ ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్న అన్నదమ్ముల్లా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు.

## దేశంలో ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కి పెరిగిందన్న డిప్యూటీ సీఎం

మొదటి పేజి తరువాయి

వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వన్యప్రాణుల సంరక్షణ, మానవ-ఏనుగుల సంఘర్షణ నివారణపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం వల్ల, 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగిందని, అలాగే 150 ఏనుగుల కారిడార్లను గుర్తించి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 132 నుంచి 142 వరకు అడవి ఏనుగులు ఉన్నాయని వెల్లడించారు. పలమనేరు, పార్వతీపురం మన్యం




ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా మారిన మానవ-ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ముసలివాగు వద్ద ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వీటి సహాయంతో 50కి పైగా ఆపరేషన్లు నిర్వహించి మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'హనుమాన్' కార్యక్రమంలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలతో పాటు ఏడు ప్రత్యేక వన్యప్రాణుల అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కి పైగా ప్రత్యేక ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఏనుగుల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా మారాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## ఇది ఆరంభం మాత్రమే.. గ్రాఫిక్స్ అన్నవాళ్ల కళ్లు తెరిపించేలా అమరావతి

మొదటి పేజి తరువాయి

అమరావతి : మూడు రాజధానుల పేరుతో గత ప్రభుత్వం ఆడిన 'మూడు ముక్కల ఆట'తో అమరావతి, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు పూర్తిగా విధ్వంసానికి గురయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపి, 30 వేల ఎకరాలు అవసరమని చెప్పిన ఆనాటి ప్రతిపక్ష నేత, అధికారంలోకి వచ్చాక మాట మార్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో కీలకమైన సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, గత ఐదేళ్లలో అమరావతిపై జరిగిన కుట్రలను, విధ్వంసాన్ని పూసగుచ్చినట్టు వివరించారు.

### అసెంబ్లీలో ఒక మాట.. బయట మరో నాటకం

గత ప్రభుత్వ తీరును ఎండగడుతూ చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఆనాడు అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు, రాజధానికి 30 వేల ఎకరాలు చాలదు, 40-50 వేల ఎకరాలు ఉండాలని ఆనాటి ప్రతిపక్ష నాయకుడు గొంతెత్తారు. తాను కూడా ఇక్కడే ఇల్లు కట్టుకుంటానని నాటకాలు ఆడారు. కానీ, ఎన్నికల్లో గెలిచిన తర్వాత మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేశారు. ఈ చర్య నన్ను తీవ్రంగా బాధించింది" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ కక్షతోనే అమరావతిని చంపేయాలని చూశారని, ఈ క్రమంలో రైతుల త్యాగాలను అవమానించారని మండిపడ్డారు.

### గ్రాఫిక్స్ అన్నవాళ్లే తలదించుకుంటారు

అమరావతి నిర్మాణ ప్రణాళికలను 'గ్రాఫిక్స్' అని ఎగతాళి చేసిన వారిపై చంద్రబాబు తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. "మేము ప్రపంచ స్థాయి నమూనాలతో ఐకానిక్ భవనాలు ప్లాన్ చేస్తే, వాటన్నిటినీ గ్రాఫిక్స్ అన్నారు. ఆ గ్రాఫిక్స్ నిజమైతే వారి పరిస్థితి ఏమవుతుందో ఒక్కసారి ఆలోచించుకోవాలి. ఈరోజు ప్రారంభమైన ఈ రాజమార్గమే వారికి సమాధానం చెబుతుంది" అని ఆయన అన్నారు. అమరావతి నిర్మాణానికి సహకరించిన సింగపూర్ ప్రభుత్వంపై కూడా గత పాలకులు వేధింపులకు పాల్పడ్డారని, వారిని కూడా ఇబ్బంది పెట్టే దుస్థితికి దిగజారారని చంద్రబాబు ఆరోపించారు. అంతర్జాతీయంగా రాష్ట్ర పరువును మంటగలిపారని విమర్శించారు.

### రైతుల ఉద్యమం చారిత్రాత్మకం

అమరావతి కోసం రైతులు చేసిన పోరాటాన్ని చంద్రబాబు కొనియాడారు. "చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఉద్యమం ఏదైనా ఉందంటే అది అమరావతి రైతుల ఉద్యమమే. మీరు పడిన కష్టాలు నేను కళ్లారా చూశాను. మీకు అండగా నిలవడానికి పార్టీ ఖాతాలో డబ్బులు లేని సమయంలో నేను జోలె పట్టి డబ్బులు వసూలు చేసి న్యాయపోరాటానికి సహకరించాను. నా భార్య సైతం తన చేతి గాజులు తీసి ఉద్యమానికి విరాళంగా ఇచ్చింది. అలాంటి మీ త్యాగాల పునాదులపైనే ఈ రాజధాని మళ్లీ నిలబడుతోంది. మీ పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా" అని భావోద్వేగంగా ప్రసంగించారు. చిన్న చిన్న న్యాయపరమైన అడ్డంకులు సృష్టించి ప్రాజెక్టును ఆపాలని చూసినా, ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని హైకోర్టు సైతం స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ఈ ఐదు సూత్రాలతో అమరావతిని భారతదేశంలోనే కాకుండా, ప్రపంచంలోని టాప్-5 రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్ సహకారంతో ఈ లక్ష్యాన్ని సాధిస్తామని స్పష్టం చేశారు. విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్‌నిర్మించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిస్వార్థంగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఈరోజు వేసింది మొదటి అడుగేనని, ఇకపై అమరావతి అభివృద్ధి పరుగులు పెడుతుందని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలను నెరవేర్చే సంకల్ప సిద్ధికి కేంద్రంగా అమరావతి నిలుస్తుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు.



"అనే నేను" - ప్రతి పౌరుడూ సైనికుడే

2047 నాటికి భారతదేశం వికసిత భారత్‌గా, ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలని ఆకాంక్షించిన చంద్రబాబు, ఈ లక్ష్య సాధనలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఒక్కరూ '... అనే నేను' (మీ పేరు చెప్పుకుని) అని ఒక సంకల్పం తీసుకోవాలి. మీ అభివృద్ధి, మీ కుటుంబం, మీ రాష్ట్రం, మీ దేశం కోసం ఏం చేస్తారో ప్రతిజ్ఞ చేయాలి. ఆ సంకల్పాన్ని ప్రతిరోజూ గుర్తుచేసుకుంటూ పనిచేయాలి. దేశ నిర్మాణంలో భాగస్వాములు కావడం అంటే యుద్ధాలు చేయడం కాదు. రైతు బాగా పంట పండిస్తే, విద్యార్థి బాగా చదువుకుంటే, ప్రతి ఒక్కరూ తమ వృత్తిలో రాణిస్తే అదే నిజమైన దేశభక్తి" అని స్పష్టం చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని, తిరంగా ర్యాలీలతో స్ఫూర్తిని నింపాలని కోరారు. ముఖ్యమంత్రి తన ప్రసంగం చివర్లో, ఈ రహదారి ప్రారంభోత్సవం అభివృద్ధి ప్రస్థానంలో తొలి అడుగు మాత్రమేనని, ఇక్కడి నుంచి ప్రతి రోజూ అమరావతి నిర్మాణం కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాలుపంచుకున్న రైతులు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ, "భారత్ మాతాకీ జై, తెలుగు తల్లికి జై, జై అమరావతి" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## 5వేల మంది పైలట్లకు డ్రగ్ టెస్టులు

మొదటి పేజి తరువాయి

ఆ పరీక్షలు తప్పనిసరని సంస్థలు పైలట్లకు పంపిన సమాచారంలో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం, అనుమతి లేని పదార్థాలు లేదా మందులను ఎవరైనా వినియోగిస్తున్నారా అనే అంశాన్ని గుర్తించేందుకు పూర్తిస్థాయి స్క్రీనింగ్ నిర్వహించనున్నారు. ఆ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభవుతాయని సమాచారం. గురుగ్రామ్‌లోని శిక్షణ అకాడమీలో శిక్షణ కార్యక్రమాలతో పాటు పరీక్షలను నిర్వహించనున్నారు. అలాగే విమాన ప్రయాణం పూర్తయిన తర్వాత ఫ్లైట్ బ్రీఫింగ్ కేంద్రాల్లో కూడా పరీక్షలు చేస్తారు. ఎయిర్‌లైన్స్ కార్యాలయాలు, ఆయా బేస్‌లకు కేటాయించిన కేంద్రాల్లో స్క్రీనింగ్ చేపట్టనున్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చాటిచెప్పేందుకే ఆ చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. విమాన సిబ్బంది విషయంలో భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేయడంతో పాటు ప్రయాణికులు, ఇతర భాగస్వాముల్లో నమ్మకాన్ని పెంచడమే లక్ష్యంగా పరీక్షలను చేపడుతున్నట్లు తెలిపాయి.

12 గంటల నిబంధన ఏం చెబుతోంది?

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిబంధనల ప్రకారం, విమాన సిబ్బంది డ్యూటీకి ముందు 12 గంటల్లో మద్యం, మత్తు కలిగించే మందులు, నార్కోటిక్ లేదా స్టిమ్యులెంట్ డ్రగ్స్ వంటివి తీసుకోకూడదు. విమానంలో ఉన్న సమయంలో కూడా ఇలాంటి పదార్థాలను వినియోగించకూడదు. అయితే కేవలం 12 గంటలు గడిచినంత మాత్రాన పైలట్ విమానం నడపడానికి అర్హుడని భావించలేం. డ్యూటీకి హాజరయ్యే సమయంలో మద్యం మత్తులో ఉండకూడదు. రక్తంలో ఆల్కహాల్ గుర్తించినా విమానం నడపడానికి అనుమతి ఉండదు. అలాగే పైలట్ పనితీరును ప్రభావితం చేసే సైకోయాక్టివ్ పదార్థాల ప్రభావంలో ఉండే లైసెన్స్ ద్వారా లభించే అధికారాలను వినియోగించకూడదు. విమానాన్ని సురక్షితంగా నడిపే సామర్థ్యంపై ప్రభావం ఉన్నట్లు తేలితే విధులకు దూరంగా ఉండాల్సి ఉంటుంది.

300 అడుగులు కిందకు పడ్డ విమానం

ఆగస్టు 4వ తేదీన పుకెట్ నుంచి దిల్లీకి బయలుదేరిన ఎయిరిండియా విమానం 2379లో ఆ ఘటన చోటు చేసుకుంది. ఎయిర్ బస్ ఏ320 విమానం ప్రయాణ సమయంలో అకస్మాత్తుగా సుమారు 300 అడుగులు కిందకు పడింది. అనంతరం కాసేపటికి అదుపులోకి వచ్చింది. దిల్లీలో సేఫ్ గా ల్యాండ్ అయింది. ఆ ఘటనలో పలువురు ప్రయాణికులతోపాటు విమాన సిబ్బంది గాయపడ్డారు. దీంతో ఆ ఘటనపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు చేస్తోంది. ఆ విమానానికి కమాండ్ చేసిన పైలట్‌కు తొలుత నిర్వహించిన స్క్రీనింగ్ అనంతరం నిర్ధరణ పరీక్ష నిర్వహించగా, గంజాయి పాజిటివ్ గా తేలింది. దీంతో విమాన భద్రతపై మరోసారి చర్చ మొదలైంది.

విమానంలో సాంకేతిక హెచ్చరికలు

మరోవైపు,379 విమానానికి సంబంధించినట్లు చెబుతున్న పోస్ట్ - ఫ్లైట్ మెయింటెనెన్స్ నివేదికలో పలు సాంకేతిక హెచ్చరికలు నమోదైనట్లు సమాచారం. ఎయిర్ బస్ ఏ320 విమానం ఇు-జులో హైడ్రాలిక్ వ్యవస్థలకు సంబంధించిన పలు లో- ప్రెజర్ అలర్ట్ లు నమోదైనట్లు నివేదిక పేర్కొంది. గ్రీన్, బ్లూ, ఎల్లో హైడ్రాలిక్ వ్యవస్థల్లో తక్కువ ఒత్తిడికి సంబంధించిన హెచ్చరికలు వచ్చినట్లు సమాచారం. ఎల్లో, బ్లూ హైడ్రాలిక్ రిజర్వాయర్స్ లో లిక్విడ్ రేంజెస్ తక్కువగా ఉన్నాయని నివేదికలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే విమానం ఒక్కసారిగా కిందకు పడడానికి పైలట్ పరీక్షలో బయటపడిన అంశాలకే కారణమని ఇప్పటి వరకు అధికారికంగా నిర్ధరణ కాలేదు. విమాన ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను ఏఏఐబీ పరిశీలిస్తోంది.

## పంచధారల' వారసత్వ సంపదకు ముప్పు.. కేంద్రం జోక్యం చేసుకోవాలి

మొదటి పేజి తరువాయి

ఆలయానికి అతి సమీపంలో మైనింగ్ జరుగుతోందని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ ప్రాంగణం గుండా ప్రవహించే ఐదు సహజ నీటి ప్రవాహాల వల్లే ఆ ప్రాంతానికి 'పంచధారల' అని పేరు వచ్చిందని, ప్రస్తుత మైనింగ్ కార్యకలాపాలతో ఆ పవిత్ర జలధారలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో వెంటనే తనిఖీలు చేపట్టాలని, పర్యావరణ ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేయాలని, అన్ని అనుమతులను పునఃపరిశీలించాలని కోరారు. ఈ అధ్యయనాలు పూర్తయ్యే వరకు మైనింగ్‌ను నిలిపివేయాలని ఆయన స్పష్టం చేశారు. ఖనిజ సంపద ప్రజలదని, దాని నిర్వహణలో పారదర్శకత ఉండాలని సుబ్బారెడ్డి అన్నారు. మైనింగ్ విధానాలను రూపొందించేటప్పుడు రాష్ట్రాల ఆదాయానికి, స్థానిక ప్రజల జీవనోపాధికి, పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని గుర్తుచేశారు. అంతకుముందు, ఇదే అంశంపై వైసీపీ ఎంపీలు గొల్ల బాబూరావు, గుమ్మ తనూజారాణి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తదితరులు ఢిల్లీలో కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మైనింగ్, బ్లాస్టింగ్ వల్ల పవిత్ర జలధారలు దెబ్బతింటున్నాయని అధికారిక విచారణలో తేలినట్లు వారు మంత్రులకు వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రులు.. పది రోజుల్లోగా ఒక కేంద్ర బృందాన్ని పంపి మైనింగ్ కార్యకలాపాలను పరిశీలిస్తామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంపీ తనూజారాణి తెలిపారు. ఈ వ్యవహారంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాత్రపై సీబీఐ విచారణ జరపాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ డిమాండ్ చేశారు. కింది స్థాయి అధికారులను సస్పెండ్ చేస్తే సరిపోదని, అక్రమ తవ్వకాలకు నిబంధనల ప్రకారం సుమారు రూ. 250 కోట్ల జరిమానా విధించాల్సి ఉందని పేర్కొన్నారు. సీఎం రమేశ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరగాలని ఆయన కోరారు.

రాహుల్ గాంధీ అహంకారానికి వర్షాకాల సమావేశాలు బలి

రాహుల్ గాంధీ అహంకారం ధోరణి వల్లే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు పూర్తిగా వృథా అయ్యాయని బీజేపీ సీనియర్ నేత, ఎంపీ రవిశంకర్ ప్రసాద్ ధ్వజమెత్తారు. గురువారం దిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసుల చర్యలపై చర్చించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా ముందుకు వచ్చినా, ప్రతిపక్షాలు సభను జరగనివ్వకుండా అడ్డుకున్నాయని ఆరోపించారు. "హోం మంత్రి అమిత్ షానే స్వయంగా మీడియా ముందుకు వచ్చి, 'పోలీసులకు సంబంధించిన సంఘటనలపై జరిగే పూర్తి చర్చను వినడానికి, వారి వాదనలన్నింటిపై స్పందించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా చర్చకు సిద్ధమన్నారు. కానీ, ప్రతిపక్షాలు వాటిని పట్టించుకోలేదు. అంతేకాదు, మరో విషయం కూడా నేను మీకు తెలియజేయాలని అనుకుంటున్నా. దిల్లీ నిరసనల్లో పోలీసు చర్యకు సంబంధించి అమిత్ షా రాజీనామా చేయాలని విపక్షాలు అంటున్నాయి. అయితే, రాహుల్ గాంధీకి పరిపాలనపై అవగాహన లేదా? పోలీసులు జరిపే కాల్పులకు హోంమంత్రి ఆదేశాలు ఇస్తారా? అక్కడ ఉండే మెజిస్ట్రేట్లు, డిప్యూటీ పోలీస్ కమిషనర్లు ప్రోటోకాల్ ప్రకారం నిర్ణయాలు తీసుకుంటారు."

**- రవిశంకర్ ప్రసాద్ , బీజేపీ ఎంపీ**

'మొండితనంతో రాజకీయాలు ముందుకు సాగవు'

దేశ రాజకీయాలు మొండితనంతో నడవవని బీజేపీ ఎంపీ రవి ప్రసాద్ వ్యాఖ్యానించారు. 'ఏదైనా నా పద్ధతిలోనే చేస్తా, నా మాటే చెల్లుతుంది' వంటి ఆలోచన ధోరణితో దేశ రాజకీయాలు, పార్లమెంట్ ముందుకు సాగవని విమర్శించారు. సభా సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి జరుగుతున్న పరిణామాలను తీవ్రంగా ఖండించారు. "ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరిస్తున్న ఆ వ్యక్తికున్న అహంకారం, బాధ్యతారాహిత్యం, 'అంతా తమకే చెందుతుందనే' ధోరణి కారణంగా పార్లమెంటు వర్షాకాల సమావేశాలన్నీ వృథా అయ్యాయి. రాహుల్ గాంధీ తండ్రి ఇతర కుటుంబీకులు ప్రధానమంత్రులుగా పనిచేశారు. ప్రధానమంత్రి నివాసానికి ఉండే ప్రాముఖ్యత గురించి ఆయనకు తెలుసు. అయినప్పటికీ, రాహుల్ తన సోదరితో కలిసి అనుమతి లేకుండానే ప్రధానమంత్రి నివాసం ముందు కూర్చున్నారు" అని రవి ప్రసాద్ వ్యాఖ్యానించారు. అలాగే, ఝార్ఖండ్ లో లేవనెత్తిన అంశంపై కూడా రవి ప్రసాద్ ప్రస్తావించారు. ఝార్ఖండ్ లో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య గురించి రాహుల్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఝార్ఖండ్ లో విద్యార్థులపై లాఠీఛార్జ్ , కాల్పులు జరుగుతున్న ఎందుకు నోరుమెదపడం లేదని అన్నారు. ఈ సంఘటనలపై ముంబయి నుంచి దిల్లీ వరకు ఉన్న మేధావులు ఎందుకు నోరు విప్పడం లేదని మండిపడ్డారు.

## అకాలీదళ్ చీఫ్ సుఖ్‌బీర్‌సింగ్ బాదల్‌పై దాడి

మహారాష్ట్రలో అకాలీదళ్ చీఫ్ సుఖ్‌బీర్‌సింగ్ బాదల్‌పై హత్యాయత్నం తీవ్ర కలకలం రేపింది. నాందేడ్‌లోని గురుద్వారాను సందర్శించిన సమయంలో ఓ నిహంగ్ సిక్కు ఆయనపై దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ దాడిలో బాదల్ చేతికి గాయమైనట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, అక్కడున్నవారు దాడి చేసిన దుండగుడిని అడ్డుకున్నారు. రక్తమోడుతున్న బాదల్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నాందేడ్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాదల్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదీ జరిగింది

బాదల్ తన కుటుంబంతో కలిసి మహారాష్ట్రలోని నాందేడ్ సాహిబ్‌లో ఉన్న తఖ్త్ శ్రీ హజూర్ సాహిబ్ వద్ద గల మాతా సాహిబ్ గురుద్వారాకు వెళ్తుండగా మధ్యాహ్నం 1:30 గంటలకు దాడి జరిగింది. నిందితుడు పదునైన ఆయుధంతో దగ్గరకు వచ్చి ఆయనను పొడవడానికి ప్రయత్నించాడు. ఈ తోపులాటలో పోలీసులు వెంటనే జోక్యం చేసుకున్నప్పటికీ, బాదల్‌కు గాయాలయ్యాయి. ఈ క్రమంలోనే ప్రత్యేక భద్రతా విధుల్లో ఉన్న ఇన్‌స్పెక్టర్ సంతోష్ కేంద్రే కూడా దాడికి

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

శుక్రవారం 14-08-2026

## యాగాల పేరుతో రేవంత్ రెడ్డి నాటకాలు: బీఆర్ఎస్ నాయకుల ధ్వజం



**గుర్రంపోడు, ఆగస్టు 13: ప్రజా న్యూస్ నెట్వర్క్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాగాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి, తెలంగాణ ప్రైవేటు ఉద్యోగస్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మునుకుంట్ల రాజేష్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల వేళ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుండి మళ్లించడానికే రేవంత్ రెడ్డి యాగాల నాటకానికి తెరలేపారని మండిపడ్డారు.ప్రభుత్వం ఇప్పటికైనా ప్రచార ఆర్భాటాలు పక్కన పెట్టి, క్షేత్రస్థాయిలో ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాశం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## చేపూర్ గ్రామంలో వర్షాల కోసం వరుణ దేవునికి ప్రత్యేక పూజలు



**గుర్రంపోడు, ఆగస్టు 13, ప్రజా న్యూస్ నెట్వర్క్ :** వరుణ దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు చల్లగా ఉండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ గుర్రంపోడు మండల పరిధిలోని చేపూర్ గ్రామంలో దేవుళ్లకు నీళ్లు పోసే సాంప్రదాయ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, పెద్దలు మరియు గ్రామ సర్పంచ్ మారపాక ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో స్థానిక దైవాల సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి వేడుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు పడి చెరువులు, కుంటలు నిండాలని, గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమారుడు మారపాక నరేందర్, వార్డు సభ్యులు నడ్డి శంకర్, జానపాటి వెంకన్న, కిలారి రామలింగం, నడ్డి బిక్షం, బద్రి లింగయ్య, కుందూరు లింగస్వామి, మారపాక మహేందర్, పుట్టపాక రవి, కుందూరు వెంకటేష్, ముష్టిపల్లి యల్లయ్య, మరియు మహిళలు ఇద్దమ్మ, వెంకటమ్మ, జానమ్మ, నావిత, రమణ, లక్ష్మమ్మ, శంకరమ్మ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## లింగగిరిలో ఎలక్ట్రిక్ స్కూటీకి అకస్మాత్తుగా మంటలు

### భార్య నడుపుతుండగా ఫైర్ అయిన స్కూటీ.. తప్పిన ప్రమాదం



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామంలో ఎలక్ట్రిక్ స్కూటీకి అకస్మాత్తుగా మంటలు చెలరేగిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెద్ది రంగయ్య భార్య ఎలక్ట్రిక్ స్కూటీపై వెళ్తుండగా వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో వెంటనే స్కూటీని నిలిపివేశారు. అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా తప్పింది. స్కూటీ నుంచి మంటలు రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించే వారు వాహనాల బ్యాటరీ, ఛార్జింగ్ వ్యవస్థ, వైరింగ్ తదితర అంశాలపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు సూచించారు. సంఘటనతో గ్రామంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## దురాజ్‌పల్లి–గరిడేపల్లి రోడ్డుపై ప్రమాదకర గుంతలకు మరమ్మతులు

### పోలీసులు-ఆర్అండ్‌బీ శాఖ సమన్వయంతో గుంతల పూడ్చివేత



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులో దురాజ్‌పల్లి––గరిడేపల్లి ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను పోలీసులు, ఆర్అండ్‌బీ శాఖ సమన్వయంతో పూడ్చివేశారు. రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ప్రత్యేక చొరవ తీసుకుని గుంతలను పూడ్చే చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ సహకారంతో ఆర్అండ్‌బీ శాఖ, పోలీసుల సమన్వయంతో చేపట్టిన ఈ చర్యలతో ప్రయాణికులకు కొంత ఉపశమనం లభించింది. రహదారిపై ఇంకా దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారులపై ఏర్పడే గుంతలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై గ్రామ ప్రజలకు అవగాహన : గ్రామ సర్పంచ్ బుర్రి శీను యాదవ్



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో ఎల్‌నినో ప్రభావం, దాని కారణంగా ఏర్పడే వాతావరణ పరిస్థితులపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో రైతులు, గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ పనులు, పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ ప్రజలకు వివరించారు. ముఖ్యంగా వర్షాలపై ఆధారపడి సాగు చేసే రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ పంటల విషయంలో తగిన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి బుర్రి శ్రీను యాదవ్, గ్రామ కార్యదర్శి మచ్చ నరసింహతో పాటు గ్రామ పెద్దలు పాల్గొని ప్రజలకు ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులపై అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు వాతావరణ శాఖ సూచనలు, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలను పాటిస్తూ పంటల సాగులో అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

## దేశ గౌరవానికి వందనం జెండా పోల్ నిర్మాణానికి సహకరించిన మెట్టుకూరు కృష్ణారెడ్డి బ్రదర్స్



**అనంతసాగరం ఆగష్టు 13 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ స్ఫూర్తితో నెల్లూరు డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ్ రెడ్డి ప్రోత్సాహంతో మెట్టుకూరు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ మెట్టుకూరు శ్రీహరి రెడ్డి సహకారంతో లింగంగుంట గ్రామంలోని మెయిన్ స్కూల్‌లో జాతీయ పతాకం కోసం జెండా పోల్‌ను నిర్మించారు.జాతీయ పతాకం పట్ల గౌరవం దేశభక్తి భావాన్ని చాటుతూ మెట్టుకూరు బ్రదర్స్ స్వంత నిధులతో పాఠశాల ఆవరణలో జెండా పోల్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు జాతీయ జెండాను ఎగురవేసే ప్రదేశం గౌరవప్రదంగా సౌకర్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం విశేషం.ప్రభుత్వంపై ఆధారపడకుండా తమ వంతు సామాజిక బాధ్యతగా పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛందంగా సహకరించడం ద్వారా మెట్టుకూరు బ్రదర్స్ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు జాతీయ పతాకానికి వందనం చేసే సమయంలో ఈ జెండా పోల్ దేశభక్తి స్ఫూర్తికి ప్రతీకగా నిలవనుంది.జాతీయ జెండా కేవలం ఒక పతాకం మాత్రమే కాదని అది దేశ గౌరవానికి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అనే భావనను విద్యార్థుల్లో మరింత బలపరిచేలా ఈ కార్యక్రమం నిలిచింది.విద్యార్థుల భవిష్యత్తు పాఠశాలల అభివృద్ధి, సమాజ సంక్షేమం కోసం మెట్టుకూరు బ్రదర్స్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. సొంత నిధులతో ప్రజా అవసరాలకు చేయూతనిస్తూ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మెట్టుకూరు బ్రదర్స్ చొరవకు పలువురు మరియు స్కూల్ యాజమాన్యం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

## పేదల సంక్షేమ పథకాలను నిలిపివేయడం సరికాదు.

### ప్రజా ఆస్తులను దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: టీఎన్‌టీయూసీ



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
హుజూర్‌నగర్ పట్టణంలోని పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి మాట్లాడుతూ పేదలు, నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను నిలిపివేయడం లేదా వాటిపై ఆంక్షలు విధించడం సరికాదని అన్నారు. తెల్ల రేషన్ కార్డుదారులకు అందుతున్న రేషన్ బియ్యం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో అవసరమని, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు ప్రభుత్వం అందించే సహాయాన్ని తప్పుపట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. పేదలకు అందుతున్న సంక్షేమ పథకాల వల్ల వారు సోమరిపోతులుగా, తాగుబోతులుగా మారుతున్నారంటూ చేసే వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. నిజంగా ప్రభుత్వ ఆస్తులు, ప్రజల ఆస్తులు దుర్వినియోగం చేస్తున్న వారు ఎవరైనా ఉంటే వారిపై కూడా అదే స్థాయిలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఉద్యోగంలో చేరిన సమయంలో ఉన్న ఆస్తులు, ప్రస్తుతం వారి వద్ద ఉన్న ఆస్తులపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు విచారణలో తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుని అక్రమ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. మరోవైపు ప్రభుత్వ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కూడా న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ సంబంధిత పరిశ్రమల యాజమాన్యాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చిన్న, పెద్ద పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యను నియంత్రించి, ఏళ్ల తరబడి అదే సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులను గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు అర్హత ఉన్న వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రస్తుతం అనేక పరిశ్రమల్లో 70 నుంచి 80 శాతం వరకు కాంట్రాక్ట్ కార్మికులతోనే పనులు చేయిస్తున్నారని, దీనివల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమను వినియోగించుకుంటూ వారి హక్కులు, వేతనాలు, భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ విషయంలో కూడా ప్రభుత్వాలు స్పష్టమైన విధానం అవలంబించాలని కోరారు. బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని నిలిపివేయాలని, ప్రజల సొమ్ముతో నిర్మించబడిన ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడి వాటిని మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆంక్షలు విధించడం కంటే ప్రభుత్వ ఆస్తులు, ప్రజా ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అక్రమంగా ఆస్తులు కూడబెట్టే వారిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శీతల రోషపతి కోరారు. పేదల సంక్షేమం, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వాలు తక్షణమే దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మరింత బలమైన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీఎన్‌టీయూసీ నాయకులు వెంకన్న, రామయ్య, రాము, రాజేష్, నాగరాజు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

### విద్యార్థులకు దుస్తుల పంపిణీ చేసిన మున్సిపల్ పాలకులు



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
హుజూర్‌నగర్ పట్టణం గోవిందపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జునరావు, 8వ వార్డు కౌన్సిలర్ కోలా ఉదయభాను ఉపేందర్ హాజరై విద్యార్థులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, మంచి విలువలు, విద్యా వికాసానికి అవసరమైన వాతావరణం లభిస్తుందని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయులు చెప్పే విషయాలను శ్రద్ధగా నేర్చుకోవాలని, చదువుతో పాటు క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, విద్యా సదుపాయాల మెరుగుదలకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జ్ఞాన కేంద్రం పనులు వెంటనే ప్రారంభించాలి



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి**
.:సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిలిచిపోయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జ్ఞాన కేంద్రం భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, ఎస్సీ రిజర్వేషన్ల అమలులో రోస్టర్ పాయింట్లను సవరించి అర్హులైన ఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం సూర్యాపేట జిల్లా ఎస్సీ, ఎస్టీ రివ్యూ సమావేశానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలిసి మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది తల్లమల్ల హస్సన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తల్లమల్ల హస్సన్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జ్ఞాన కేంద్ర భవన నిర్మాణం నిలిచిపోవడం బాధాకరమని, విద్యార్థులు, నిరుద్యోగులు, యువతకు ఉపయోగపడే విధంగా జ్ఞాన కేంద్ర నిర్మాణాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీలలో మౌలిక వసతుల కొరతను పరిష్కరించేందుకు సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని, ఇందుకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేసి పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో ఎస్సీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి రోస్టర్ పాయింట్లను సమీక్షించి అవసరమైన సవరణలు చేయాలని, దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి ప్రత్యేక చర్యల ద్వారా వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులు, సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బోలెద్దు వినయ్, రాష్ట్ర నాయకులు సల్వాది మల్లయ్య, జిల్లా నాయకులు దాసరి దేవయ్య, గాజుల నరసయ్య, కాశమల్ల వెంకట నరసయ్యతో పాటు సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు సంతాపం



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ డి.పోచంపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆనబోయిన రాజశేఖర్ యాదవ్ తల్లి ఆనబోయిన అంజమ్మ ఇటీవల మరణించిన నేపథ్యంలో, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దివంగత ఆత్మకు శాంతి చేకూరాలని తన మద్దతును మరియు ధైర్యాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్, భాస్కర్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, సాయి యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి సర్కిల్ జనరల్ సెక్రెటరీ కొల్తూరు మల్లేష్ ముదిరాజ్ పాక్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, నాయకులు మైసయ్య గౌడ్, బైండ్ల గోపాల్, శ్రీకాంత్ యాదవ్ కట్టా సుందర్ బాబు కుసుంబ, సాంబ రాజు, శేఖర్, మరియు స్థానికులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అమరవరం లిఫ్ట్ నడిపించేందుకు మంత్రి ఉత్తమ్ సానుకూల స్పందన

### రైతుల పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని హామీ



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి** :హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మఠంపల్లి మండలంలో వర్షాభావ పరిస్థితులతో పంటలకు సాగునీరు అందక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో ఇప్పటికే సాగు చేసిన పంటలకు సరిపడా నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మఠంపల్లి మండలంలోని కాల్వపల్లి తండా సర్పంచ్ సక్రునాయక్, దొనబండ తండా సర్పంచ్ అరుణ దేశ్ పాండు, అల్లిపురం సర్పంచ్ జ్యోతి పిచ్చిరెడ్డి హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి రైతుల ఇబ్బందులను వివరించారు. దాదాపు ఎనిమిది గ్రామ పంచాయతీల పరిధిలోని రైతుల పంటలను కాపాడేందుకు అమరవరం లిఫ్ట్‌ను వెంటనే నడిపించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, ప్రస్తుతం నీరు అందిస్తే పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అమరవరం లిఫ్ట్ నడిచేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందించి రైతుల పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సర్పంచులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని అమరవరం లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా హనుమా నాయక్, ఉపసర్పంచ్ ధరావత్ నితిన్, చంటి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## త్రిపురారం మండలంలో అనుమతి లేకుండా బోర్లు వేస్తే రూ.లక్ష జరిమానా

### బోర్లు వేయించేవారు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి

**త్రిపురారం మండలం ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**
నల్లగొండ జిల్లా పరిధిలోని త్రిపురారం మండలంలోని అన్ని గ్రామాల్లో పంట పొలాలు, నివాస గృహాల వద్ద బోర్లు వేయించేవారు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని తహసీల్దార్ గాజుల ప్రమీల సూచించారు. అనుమతులు లేకుండా బోర్లు వేస్తే నిబంధనల ప్రకారం రూ.లక్ష వరకు జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు గ్రామపంచాయతీ అధికారులతో పాటు బోర్ల నిర్వాహకులతో సమీక్ష నిర్వహించిన తహసీల్దార్, బోర్లు వేయించే ముందు సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. భూగర్భ జలాల పరిరక్షణతో పాటు బోర్ల తవ్వకాల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా బోర్లు వేసే నిర్వాహకులపై ఎలాంటి మినహాయింపులు లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా బోర్ల తవ్వకాలు జరగకుండా గ్రామపంచాయతీ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు కూడా అనుమతులు లేకుండా బోర్లు వేయకుండా అధికారుల సూచనలు పాటించాలని తహసీల్దార్ కోరారు.

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక
శుక్రవారం 14-08-2026

## నేతన్న సేవ పథకం కోసం ఎండీవోకు చేనేత కార్మికుల వినతి

### పాయకరావుపేటలో సుమారు 40 మంది అర్హులకు పథకం అందలేదని ఆవేదన



**పాయకరావుపేట, ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్వర్క్:** పాయకరావుపేట గ్రామానికి చెందిన చేనేత కార్మికులు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండల అభివృద్ధి అధికారి (ఎండీవో)కు వినతిపత్రం సమర్పించారు. గత 30 సంవత్సరాలుగా పాయకరావుపేటలో స్థిర నివాసం ఉంటూ చేనేత వృత్తినే జీవనాధారంగా కొనసాగిస్తున్నామని వారు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్న సేవ పథకం కింద ప్రతి చేనేత కార్మికుడికి రూ.25,000 చొప్పున అందించనున్నట్లు ప్రకటించినప్పటికీ, పాయకరావుపేట గ్రామంలో సుమారు 40 మంది నిజమైన అర్హులైన చేనేత కార్మికులకు ఇప్పటివరకు లబ్ధి చేకూరలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ నిర్వహించి, అర్హులైన చేనేత కార్మికులను గుర్తించి నేతన్న సేవ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఎండీవోను కోరారు. ఈ మేరకు జి. త్రిమూర్తులు, ఆర్.. సుబ్రహ్మణ్యం, కే. కామాక్షి, భీ. మణి, బి. వీరమణి తదితరులు ఎండీవోకు వినతిపత్రం అందజేశారు.

## సాగునీటి కోసం రైతుల విజ్ఞప్తి

### రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీ, సబ్సిడీ రుణాలు ఇవ్వాలని నాయకుల డిమాండ్



**తుని--తొండంగి, ఆగస్టు 13 (ప్రజా న్యూస్ నెట్వర్క్):** తొండంగి, తుని మండలాల రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యపై అధికారుల దృష్టి సారించాలని కోరుతూ అన్నవరం పంపా రిజర్వాయర్ కార్యాలయంలో సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. రిజర్వాయర్ నుంచి తక్షణమే నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్‌కు వెళ్లే ఏలేరు కాలువలో రౌతులపూడి మండలం బంగారయ్యపేట గ్రామం వద్ద 33.5 రీచ్ సమీపంలో ఏర్పాటు చేసిన అత్యవసర తూము ద్వారా నీటిని విడుదల చేసి పంపా ప్రాజెక్టుకు నీరు అందించే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు.అలాగే గోదావరిలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఏలేరుకు నీటిని విడుదల చేసి, ఆర్.ఆర్.బి. ట్యాంక్ ద్వారా ఉప్పు ట్యాంక్‌కు నీరు చేరేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు ప్రత్యామ్నాయాల ద్వారా సాగునీరు అందించే అంశంపై జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొంటూ, రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, సబ్సిడీ రుణాలు అందించి ఆర్థికంగా చేయూతనివ్వాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యనమల కృష్ణుడు, కొయ్యు మురళీకృష్ణ, తుని జెడ్పీటీసీ పోతల రమణ, బత్తుల వీరబాబు, నాగం గంగబాబు, యాదాల కృష్ణ, అంబుజాలపు అప్పలరాజు, అన్నవరం ఎంపీటీసీ దడాల సతీష్, ఎంపీటీసీ కొంతి సతీష్, గాబు రాజు, రాయవరపు శ్రీను, పేకేటి హరికృష్ణ, తోట కొండబాబు, కటకం ఈశ్వరరావు, పెరుమాళ్ల లోవరాజు, అడపా సురేష్, కొయ్యు బుజ్జి, రౌతు శివ తదితరులతో పాటు తొండంగి మండలానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

## 30 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

### అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్వర్క్**

కుత్బుల్లాపూర్: రంగారెడ్డి నగర్ డివిజన్ లోని రంగారెడ్డి నగర్ లో రూ.30 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు శ్రీ కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కాలనీల్లో రోడ్ల సమస్యను పరిష్కరించేందుకు రూ.30 లక్షల నిధులు మంజూరు చేసి విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ప్రజల ప్రాథమిక అవసరాలను పట్టించుకోకుండా, అనేక ప్రాంతాల్లో కనీస మౌలిక వసతుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని కూన శ్రీశైలం గౌడ్ విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతను గత పాలకులు విస్మరించారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేస్తూ పనులను చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని, రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కూన శ్రీశైలం గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతే శ్రీనివాస్ యాదవ్, జి రమేష్, బాలరాజు, రమేష్ మంజూల్కర్, కాజా బాయ్, తిమ్మయ్య, పురుషోత్తం మాధవి నయీమ్, ఆనంద్ గౌడ్ షకీర్, మల్లం శ్రీను నారాయణ రాకేష్ జ్ఞానేశ్వర్ రెడ్డి, తోకలా శ్రీనివాస్ శ్యామల కార్యకర్తలు స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## రైతుల కోసం వరుణ యాగం.. ఏర్పాట్లు షురూ



**తుని, ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్వర్క్:** వరుణ కటాక్షం కోసం మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విప్ శ్రీమతి యనమల దివ్య సంకల్పించిన యజ్ఞయాగాలకు శుభ ముహూర్తం సమీపిస్తున్న నేపథ్యంలో యనమల గార్డెన్స్‌లో యాగశాలల నిర్మాణ పనులకు అంకురార్పణ జరిగింది. రైతుల భాగస్వామ్యంతో యాగశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు–విజయలక్ష్మి దంపతుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తమరాన వరలక్ష్మి--రామకృష్ణ దంపతుల చేత పూజా కార్యక్రమాలు నిర్వహించిన వేదపండితులు రాటమహోత్సవ ప్రక్రియను శాస్త్రోక్తంగా నిర్వహించారు.వరుణ యాగానికి సంబంధించిన ఏర్పాట్ల నిర్వహణలో భాగంగా యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, యినుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, కుసుమంచి సత్యనారాయణ, మల్ల గణేష్, సూరంపూడి చంద్రశేఖర్, కుక్కడపు బాలాజీ, పరవాడ తాతబాబు, కర్రి శ్రీదేవి, కరపా అప్పారావు, చిటికెల శ్రీనివాసరావు, కపోలిశెట్టి రామలింగేశ్వరరావు, అప్పన రమేష్, బోడాల జమీలు, తుమ్మలపల్లి నానీ, సుర్ల బోడయ్య, తమరాన సత్యనారాయణ, జక్కాన రామునాయుడు, చామంతి సత్తిబాబు, గజ్జి అప్పలరాజు, గజ్జి రాంబాబు, కలగా శ్రీనుబాబు, అడిగర్ల నర్సింహమూర్తి, దంతులూరి శ్రీనివాసరాజు, దండెం నాగు, కుర్రా వెంకటరమణ, కొత్తూరి బుజ్జి, కొత్తూరి ఈశ్వరరావు, చోడిశెట్టి శేషగిరి, నంబారు వెంకన్న, అత్తి అచ్యుతరావు, వంగలపూడి నాగేశ్వరరావు, దాసరి నారాయణరావు, ములికి సూరిబాబు, పోతల సూరిబాబు, ఆవుగడ్డి రమణ, కొల్లు బుజ్జి, కొల్లు సత్యనారాయణ, గంట్ల చంటి, చిట్టిబాబు, గంధం బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదు

### బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 13 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** కుత్బుల్లాపూర్ దుండిగల్ ఇండస్ట్రీ ఏరియాలో ఓ కంపెనీలో సితేందర్ రామ్ అనే కార్మికుడు పనిచేస్తున్నాడు.. ఆ కార్మికునికి జనవరి నెల వేతనం 16000/- వేలు రూపాయలు రావాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో... ఎవరైతే మనకు న్యాయం చేస్తారని తెలుసుకొని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు రవి కార్యాలయం వద్దకు వెళ్లి కార్మికుడు సితేందర్ రామ్ కి జరిగిన అన్యాయం వివరించారు, వెంటనే స్పందించిన రవి హుటాహుటిన దుండిగల్ ఇండస్ట్రీ కంపెనీ యజమాన్యంతో మాట్లాడి కార్మికునీకి రావలసిన జనవరి నెల వేతనం కార్మికుడు సితేందర్ రామ్ కు పైసలు రూపంలో వేతనం మొత్తం 16000/- రూపాయలు ఇవ్వడం జరిగింది... కార్మికుడు సితేందర్ రామ్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ పాల్గొన్నారు.

## దోమల నివారణకు మినీ ఫాగింగ్..



**విశాఖపట్నం, ఆగస్టు 13: ప్రజా న్యూస్, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం.నాయుడు.** జీవీఎంసీ 61వ వార్డు ప్రజల వినతి మేరకు ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ , శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం ఆలయ ధర్మకర్త, జనసేన పార్టీ , 61వ వార్డు అధ్యక్షులు దుంగ దేవన్ రాజు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మినీ ఫోగింగ్ నిర్వహించారు, దేవన్ రాజు మాట్లాడుతూ.. ఈ మధ్య కురిసిన చిన్నపాటి వర్షాలు కారణంగా తేమ , చెమ్మ , చెత్తా చెదారాలు పేరుకు పోవడం వల్ల దోమలు , క్రిమి కీటకాలు ఎక్కువై డెంగ్యూ , మలేరియా తదితర విషజ్వరాలు అధికంగా ఉండడం కారణంగా నివారణ కొరకు మినీ ఫోగింగ్ వెంకన్నపాలెం, రామకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ సిబ్బందితో కలసి ఫోగింగ్ నిర్వహించారని తెలిపారు, ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది , జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో తెలుగు వారి భాగస్వామ్యం

**తొమ్మిది దశాబ్దాల క్రితం 1930 ఏప్రిల్ 6 న మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘటన. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ, 1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీ టర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం.**



భారత దేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. అది మహాత్మా గాంధీచే ప్రారంభించ బడిన ఒక అహింసా ప్రచారోద్యమం. ఇది బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగింది. ఉప్పుపై పన్ను చెల్లిం చేందుకు నిరాకరించి, మార్చి 12, 1930న చేప ట్టిన దండి యాత్రనే ఉప్పు సత్యాగ్రహంగా పేర్కొంటారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్య మాల సారమే ఈ ఉప్పు సత్యాగ్రహం. ఈ యాత్ర సబర్మతి ఆశ్రమం నుంచి ఎనభై మందితో ప్రారంభమై గుజరాత్ లోని సముద్ర తీరంలో ఉన్న పల్లెటూరు దండి వరకూ సాగింది. కనుక దీనికి ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమంగా పేర్కొంటారు. కోట్లమంది భారతీయులపై బ్రిటిష్ రాజ్ వేసే ఉప్పు పన్నుకు వ్యతిరే కించిన మౌన నిరసన కార్యక్రమం అది. దానిని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ పిలుస్తారు. 1920 - 22 నాటి సహాయ నిరాకరణోద్యమం తరువాత ఈ మార్చ్ బ్రిటిష్ అధికారానికి అత్యంత ముఖ్యమైన వ్యవస్థీకృత సవాలు విసిరింది. 1930 జనవరి 26 న భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య నినాదం ప్రకటించిన వెంటనే దండి సత్యాగ్రహం మొదలైంది. ఉప్పు పన్ను బ్రిటిష్ రాజ్ పన్ను ఆదాయంలో 8.2% వరకూ ఉంటుంది. పేద భారతీయులకు చాలా భారంగా ఉండే పన్ను ఇది. ఉప్పు తయారీనే నిరసనకు, సత్యాగ్రహానికి తాను ఎందుకు ఎంపిక చేసిందీ వివరిస్తూ గాంధీ... "గాలి, నీరూ... ఆ తరువాత బహుశా ఉప్పే జీవితానికి అత్యవసరం" అని అని పేర్కొన్నారు. ఉప్పు చట్టాలను ధిక్కరించడం ద్వారా గాంధీ శాసనోల్లంఘనను ప్రారంభిస్తారని ఫిబ్రవరి 5 న వార్తా పత్రికలు రాసాయి. ఉప్పు సత్యాగ్రహం మార్చి 12 న అహ్మదాబాదు లోని సబర్మతి ఆశ్రమంలో ప్రారంభమై ఏప్రిల్ 6 న దండిలో ముగుస్తుందని పత్రికలు పేర్కొన్నాయి. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్ర హులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సత్యాగ్రహం ప్రారంభానికి కొన్నిరోజులకు ముందే బ్రిటిష్ వారు గాంధీని మార్చి 5, 1930 న అరెస్టు చేశారు. ఈ సత్యాగ్రహం దాదాపు ఒక సంవత్సర కాలం నడిచింది. ఈ సత్యాగ్రహం మూలంగా దాదాపు 80,000 వేలకు పైగా భారతీయులు కారాగారాల పాలయ్యారు. లక్షల కొద్దీ భారతీయులు స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితుల య్యారు. దండి మార్చిలో మహాత్ముడితో పాటు 79 మంది అనుచరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి దండి మార్చిలో గాంధీతో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి యెర్నేని సుబ్రహ్మణ్యం. తర్వాత కాలంలో ఆయన గాంధీ సిద్ధాంతాలతో కొమరవోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. నెల్లూరులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దండు నారాయణ రాజును నాటి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో ఆయన అక్కడే మరణించారు. ఉప్పు సత్యా గ్రహం సమయం లోనే 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి... "వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరొ తెల్పుడి" అనే గేయ కవితను రాశారు. మాక్సిం గోర్కీ రాసిన రష్యన్ నవల 'ది మదర్'ను 'అమ్మ' పేరుతో తెలుగులోకి అనువదించిన క్రొవ్విడి లింగరాజు ఈ ఉద్యమ సమయంలోనే దేశ ద్రోహం నేరంపై జైలుకెళ్లారు. బ్రహ్మ జోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించారు. దీన్నే 'ఆంధ్రా దండి'గా పిలుస్తారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భం లోనే కేంద్ర శాసన సభకు రామదాసు పంతులు, శాసన మండలి సభ్యత్వానికి స్వామి వెంకటాచలం రాజీనామాలు చేశారు. ఉప్పు చట్టాలను ఉల్లఘించి బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ ( మాలపల్లి నవల రచయిత), ఖాసా సుబ్బారావు లాఠీ దెబ్బలు తిన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులోని తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ పట్నంలో తెన్నేటి విశ్వనాథం, మచిలీ పట్నంలో అయ్యదేవర కాళేశ్వరరావు, రాయలసీమ పరిధిలో కల్లూరి సుబ్బారావు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడ గోపాలరెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మారు. అలా లక్షలాది మంది తమ సొంత ఉప్పును తయారు చేసు కున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జాతీయ గీతం జనగణమన



**భారతదేశ జాతీయగీతం 'జనగణమన' గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే జనగణమనకు ఆ స్వరాన్ని కట్టింది ఒక ఐరిష్ జాతీయురాలని... దానికి వేదికైంది చిత్తూరు జిల్లా మదనపల్లె అనే విషయం చాలా మందికి తెలియదు.**

నోబెల్ బహుమతి గ్రహీత, రవీంద్రనాథ్ టాగోర్ రాసిన బెంగాలీ గీతం లోని మొదటి భాగం ఇది. సంస్కృత పద భూయిష్టమైన బెంగాలీ భాషలో ఉంది. జనగణమన గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిజానికి 1911లోనే రాశారు. అదే ఏడాది డిసెంబర్ 27న కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో కూడా దానిని ఆలపించారు. 1912 జనవరి లో ఈ గీతాన్ని "తత్వ భోదిని" అనే పత్రిక "భారత విధాత" అనే పేరుతో ప్రచురించింది. తర్వాత కూడా జాతీయోద్యమం నేపథ్యంలో ఆ గీతాన్ని అనేక సార్లు, అనేక వేదికల మీద ఆలపించారు. అయితే ఇప్పుడు మనం వినే ట్యూన్‌లో కాకుండా, నిర్దిష్టమైన స్వర కల్పన లేకుండా, ఎవరికి నచ్చిన రాగంలో వాళు పాడుకునే వారు. భారత స్వాతంత్రోద్యమాన్ని బలపరిచిన డాక్టర్ అనీబిసెంట్ మదనపల్లెలో థియోసాఫికల్ కాలేజీని స్థాపించారు. ఐరిష్ జాతీయుడైన ప్రముఖ విద్యావేత్త జేమ్స్ హెన్రీ కజిన్స్ దాని ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. లండన్ మ్యూజిక్ కాలేజిలో చదువుకున్న ఆయన భార్య మార్గరెట్ కజిన్స్ అక్కడ సంగీతాన్ని నేర్పించేవారు.

1919లో దక్షిణ భారతదేశ పర్యటనలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఒకరోజు బెంగళూరు చేరుకున్నారు. మదనపల్లె వాతావరణం, జేమ్స్ కజిన్స్ కవిత్వం అంటే చాలా ఇష్టమైన ఠాగూర్, కజిన్స్ అక్కడే ఉన్న విషయం తెలుసుకుని, ఆయన విశ్రాంతి కోసం మదనపల్లెలోని థియోసాఫికల్ కాలేజీ చేరుకున్నారు. ఠాగూర్‌కు ప్రశాంత వాతావరణం కలిగిన థియోసాఫికల్ కాలేజీలో ప్రతి బుధవారం భోజనాల తర్వాత విద్యార్థులంతా కలిసి పాటలు పాడేవాళ్లు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఠాగూర్, ఒక కార్యక్రమంలో పాల్గొని, ఆ సందర్భంగా ఆయన స్వయంగా తన గొంతుకతో జనగణమన ఆలపించారు. ఠాగూర్ కంఠస్వరం నుంచి వెలువడిన ఆ పాటకు విద్యార్థులంతా గొంతు కలిపారు. మార్గరేట్ కజిన్స్ కూడా ఆ సమయంలో అక్కడే ఉండి, పాటలోని దేశభక్తిని, జాతీయ భావాన్ని గమనించారు. కానీ అప్పటికి జనగణమనను ఎవరికి వారే తోచిన రీతిలో పాడుకునే వారు. ఎవరూ రాగయుక్తంగా పాడ లేదు. కనుక దానిని తానే స్వరబద్ధం చేయాలని నిర్ణయించు కున్నారు. తెల్లవారి ఆమె ఠాగూర్‌ను కలిసి జనగణమనను స్వరబద్ధం చేయాలన్న తన కోరికను వెలిబుచ్చారు. దీనికి అంగీకరించిన ఠాగూర్, ఆమెకు ఆ పాట అర్థాన్ని వివరించారు. దానికి స్వరం ఎలా ఉంటే బాగుంటుందో సూచించారు. తర్వాత మార్గరేట్ కజిన్స్ తన విద్యార్థినుల సహాయంతో ప్రతి పదానికి అర్థం తెలుసుకుంటూ దానికి. బాణీ సమకూర్చారు. తర్వాత ఠాగూర్‌కు తాను కట్టిన స్వరాన్ని వినిపించారు. కొన్ని చిన్న చిన్న సంగీత పరికరాలతో విద్యార్థులు రాగయుక్తంగా పాడిన జనగణమన గీతాన్ని విన్న ఠాగూర్ ఆమెను ఎంతగానో అభినందించారు. బెంగాల్‌లో పుట్టిన జనగణమన గీతం మదనపల్లెలో స్వరాన్ని సమకూర్చు కున్నది. రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లెలో ఉన్న సమయంలోనే ఒక ఉదయాన థియోసాఫికల్ కాలేజీ ప్రాంగణం లోని చెట్టుకింద కూర్చుని జనగణమనను ఆంగ్లం లోనికి అనువదించారు కూడా. తర్వాత దానిని తన అందమైన చేతిరాతతో రాయడమే కాకుండా, కింది భాగంలో దాని పేరు 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' అని రాశారు. దాని కింద ఫిబ్రవరి 28, 1919 అని రాసి, సంతకం చేసి, మార్గరేట్ కజిన్స్‌కు బహుమానంగా ఇచ్చారు. మదనపల్లె కాలేజీ వదలివెళ్లే ముందు ఠాగూర్ దానిని 'దక్షిణ భారతదేశపు శాంతినికేతన్' అని కీర్తించారు.ఈ గీతానికి సంగీత బాణీ కూడా ముందుగా ఠాగూర్ సృష్టించారు. దేశభక్తి గేయమైన జనగణమన బాణీ కనుగుణంగా ఈ గీతాలాపన చేసేందుకు 52 సెకండ్లు పడుతుంది. అప్పుడప్పుడు మొదటి, చివరి పాదాలను మాత్రమే పాడే పద్ధతి కూడా ఉంది. దీనికి 20 సెకండ్లు పడుతుంది

1950 జనవరి 24 న జాతీయగీతంగా రాజ్యాంగ సభ స్వీకరించింది... 'జన గణ మన' ఇక నుంచీ మన కొత్త గణతంత్ర రాజ్యానికి జాతీయ గీతమనీ, దీన్ని అంతా గౌరవించి ఆదరించాలనీ 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఓ ప్రకటన చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహోన్నత పాత్ర పోషించిన 'వందేమాతరం' గీతాన్ని కూడా జన గణ మనతో సమానంగా గౌరవించి ఆదరించాలి" అని ఆ రోజున రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. భారతదేశ రాజ్యాంగం ఆర్టికల్ 51ఏలో ఈ గీతాన్ని గౌరవించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రస్తావన కనిపిస్తుంది. "ప్రతి పౌరుడూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. జాతీయ పతాకం, జాతీయ గీతం వంటి రాజ్యాంగ ఆదర్శాలు, లక్ష్యాలు, సంస్థలను గౌరవించాలి" అని ఈ చట్టం పేర్కొంటున్నది. ప్రార్థనగా, కృతజ్ఞతగా పఠించే 52 సెకన్ల ఈ చిన్న గీతానికి ఉన్నంత గుర్తింపు , భారత దేశంలో, ప్రపంచంలో కూడా మరే గీతానికీ లేదు. మన జాతీయ గీతం దేశ సమైక్యతకు సరైన ప్రతీకగా నిలిచింది. జాతీయ గీతం, జాతీయ పతాకం పట్ల గౌరవం, ప్రేమాభిమానాలు ప్రదర్శించడమంటే మాతృభూమిని గౌరవించు కోవడమే అవుతుంది. ఇది ప్రతి ఒక్కరిలో దేశభక్తిని, జాతీయ భావాన్ని నింపడానికి ఉపకరిస్తుంది. జనగణమన పాడినప్పుడు దాని అర్థాన్ని కూడా ఒక్కసారి మననం చేసుకోవాలి. దాని నేపథ్యాన్ని, అర్థాన్ని, ప్రాధాన్యతను గుర్తించి, తర్వాత తరం వారికి చేర్చాల్సిన అవసరం అనివార్యంగా ఉంది

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494